


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### చాయ్ షాట్స్

**ఈ మధ్య చాయ్ షాట్స్** అని మా మేనల్లుడు, చాయ్ బిస్కెట్ కంపెనీలో ప్రవేశపెట్టిన కొత్త ప్లాట్‌ఫార్మ్ కి నేను క్రియేటివ్ కన్సల్టెంట్ అయి ఆ బాధ్యతలు చూస్తున్నాను.

శరత్ అనే మా అన్నయ్య కొడుకు ఈ ఫిల్మ్ ఇండస్ట్రీలో కొచ్చి ‘మేజర్’, ‘పద్మభూషణ్’, ‘మేము ఫేమస్’. ఇప్పుడు రిలీజ్‌కున్న ‘రావ్ బహదూర్’లాంటి సినిమాలు తీశాక, 'చాయ్‌షాట్స్' అనే ఈ ప్లాట్‌ఫార్మ్ మీద 2మినిట్స్ ఎపిసోడ్స్‌గా తీయడం కథలు మొదలు పెట్టాడు.

ఏం రోజులొచ్చాయండీ? సంగంలాంటి సినిమాలు రెండు ఇంటర్వెల్స్‌వి చూసాం, ఇంకా కొన్ని పౌరాణికాలూ అవీ మూడున్నర గంటలు కదలకుండా కూర్చుని థియేటర్స్‌లో చూసాం. తర్వాత సీరియల్స్ వారం వారం ఆగి ఒక ఎపిసోడ్ చూసి, తిరిగి ఆ వారం ఎప్పుడొస్తుందా? అని ఆశగా ఎదురు చూసాం. అప్పట్లో హిందీ సీరియల్స్ సినిమా స్టాండర్డ్స్‌ని నిలబెడ్తూ హమ్ లోగ్ లాంటి సీరియల్స్ తీసేవారు. సాన్స్, సైలాబ్, అడోస్ పడోస్, ఏ జో హై జిందగీ.. శాంతీ, కాందాన్, మనోరంజన్, సర్కస్, నుకడ్, ఉడాన్, ఆరోహీలాంటి షోస్ వచ్చేవి. ఆ తర్వాత డయిలీలు కూడా ఎన్నడూ నిరాశపరచలేదు. బయటకి పనులున్నా వెళ్ళడం మానుకుని ఇంట్లో ఆ సీరియల్స్ టైంకి కూర్చోవడం అలవాటు చేసారు రామానంద్ సాగర్‌లాంటివారు మహాభారత్, రామాయణ్‌లాంటివి అన్ని వయసుల వారి కోసం తీసి. ఇంక రియాల్టీ షోస్, కె.బి.సీ, బిగ్‌బాస్, సా, రే, గా, మా, పా...లాంటివి చెప్పనక్కర్లేదు.

సో డార్విన్స్ పరిణామ సిద్ధాంతంలా ఇవన్నీ దాటి ఫాస్ట్ జెనరేషన్స్ జెన్ జీ, ఆల్ఫాజీ లాంటి వారి కోసం, ఫాస్ట్ ఫుడ్స్ పిజ్జా, నూడిల్స్, టిన్డ్ ఫుడ్స్‌లాంటివి వచ్చినట్టే, 'షాట్స్' అనేవి ప్రవేశ పెట్టారు.

ముఖ్యంగా సీరియల్స్‌కి ఎడిక్ట్ అయి, 'ఎంతకీ అవవు జీడిపాకం సీరియల్స్, మా పిల్లలకి మూడో ఏడున్నప్పుడు మొదలు పెట్టారు ఈ సీరియల్, ఇప్పుడు వాళ్ళకి పిల్లలు పుట్టారు" అని కంప్లయింట్ చేస్తుంటే, చేతిలో ఫోన్ వుంటే చాలు.. మా వర్టికల్స్ చూడండి, "చాయ్ షాట్స్ డౌన్‌లోడ్ చేసుకోండి, ఇక్కడ హై అవండి" అని ఈ ప్లాట్‌ఫార్మ్ క్రియేట్ చేసారు మా శరత్, వాడి ఫ్రెండ్ అనురాగ్ కలిసి.

ఇక్కడ కొంచెం ఆగి ఒకేసారి 9 ప్రాజెక్ట్స్ మొదలు పెట్టిన నా కష్టాలు చెప్తాను వినండి. ప్రొడక్షన్ కష్టాలు.

ఒక కథా మాటలూ స్క్రీన్‌ప్లే రాసి ఓ అమ్మాయి ప్రొడక్షన్, డైరెక్షన్ కూడా నేనే చేస్తా అంటే ఇచ్చాను.

ఆ అమ్మాయి ఓ కాస్టింగ్ డైరెక్టర్‌ని పెట్టుకుంది. మిగతా ప్రొడక్షన్స్‌కి నేనే కేస్టింగ్ చేసాను.

షూటింగ్ ముందు ఫోటోలు పంపింది. "బాగానే వున్నారు. ఆడిషన్ చేసి పెట్టుకో" అన్నాను. చేసానంది. పెట్టుకుంది.

షూటింగ్ మొదలయింది. ఈ భార్య వేషం అమ్మాయి, ఆ భర్త భుజం మీద వాలమన్నా, దగ్గరగా వెళ్ళి నిలబడమన్నా, దూరంగా వుంటోంది. అతన్ని భార్య బుగ్గమీద చిటికె వెయ్యమన్నా వెయ్యడం లేదు. లంచ్ టైంలో ఈ భార్య వేషం అమ్మాయి చెల్లెలు వచ్చింది. ఆ చెల్లెలు ఈ మొగుడి వేషం అబ్బాయి భుజాలు పట్టుకుని వేలాడ్డం చూసాను.

నేను డైరెక్టర్ అమ్మాయిని పిలిచి, "పెళ్ళాం వేషం అమ్మాయితో దూరంగా వుంటాడు. ఆ అమ్మాయి చెల్లెలితో వేళ్ళాడ్డాడేమిటి?" అని అడిగాను.

"నాకూ ఈరోజే తెలిసింది మేడం.. ఆ పెళ్ళాం వేషం అమ్మాయి, హీరోకి వదినగారుట. అంటే ఈ చెల్లెలు మొగుడు ఇతను నిజ జీవితంలో. ఈ చెల్లెలు రోజూ షూటింగ్‌కి రావడం వల్ల ఆ అమ్మాయి అతనితో క్లోజ్‌గా వుండటం లేదు అనుకుంట, ఎంతైనా మరిది కదా!" అంది.

"నీకు ఆడిషన్ రోజు కూడా ఈ విషయం వాళ్ళు చెప్పలేదా?" అని అడిగితే, "షూటింగ్ స్టార్ట్ అయ్యాక చెప్పారు మేడం" అంది నెమ్మదిగా డైరెక్టర్.

"ఏడి ఆ కేస్టింగ్ డైరెక్టర్?" అని అడిగాను.

అతను వచ్చాడు.

"ఇందులో ఓ డాక్టర్ వేషం వుంది, అతను కూడా ఈ హీరో తమ్ముడట మేడమ్" అంది నెమ్మదిగా డైరెక్టర్.

"ఏవయ్యా? కేస్టింగ్ డైరెక్టరూ? ఓ ఇంటిముందు ఆటో ఆపి ఆ కుటుంబ సభ్యులందరినీ ఆటో ఎక్కించుకొచ్చావా? ఇదేనా ఓ కేస్టింగ్ డైరెక్టర్ చెయ్యాల్సిన పనీ?" అని నేను నిలదీసినా, ఆర్టిస్టులు కమిట్ అయిపోయారు తెరమీద. ఏమన్నా ఏం లాభంలేదు.

ఆ చెల్లెలు కార్తీక మాసం అక్క ఉపవాసాలు అన్న వంకతో దిబ్బ రొట్టో, ఉప్పుడు పిండో పట్టుకుని రోజూ షూటింగ్ లొకేషన్‌కి సిద్ధం. ఇంక ఆ కామెడీ షాట్స్ పేరు చెపితే మీరింకా ఆశ్చర్యపోతారు. అది చాయ్ షాట్స్‌లో వుంది. ఇద్దరి మొగుడూ ఒకరే.. అన్న అర్థం వచ్చే పేరు. టీ.వీ సీరియల్స్ మీద పేరడీ.

మా తొమ్మిది ప్రొడక్షన్సూ మొత్తానికి పెళ్ళి వారిల్లులా, బ్రేక్‌ఫాస్ట్‌లూ, కార్తీక మాసపు వనభోజనాల్లా, లొకేషన్‌లలో మా అందరికీ విందు భోజనాలతో, మా జోక్స్‌తో పరిసరాలు దద్దరిల్లేట్టుగా జరిగాయి.

మన యూట్యూబ్‌లో వంటలు చేసే పళనిస్వామిగారిని కూడా మొదట చాయ్ బిస్కెట్ వాళ్ళే ఆర్టిస్ట్‌గా మార్చారు. నేను రాసిన 'స్వీట్ సిక్స్‌టీ' యూట్యూబ్‌లో వుంది. కావాలంటే చూడండి. ఇందులో కూడా 'ఊరికి ఒకే అమ్మాయి'లో భూతాలరాజుగా ఆయన బాగా నటించారు.

"అమ్మా వంటగది వుంటే, మీ అందరికీ లేత అరిటాకుతో పచ్చడి చేసి వడ్డిస్తాను" అని తెగ ఉత్సాహపడ్డారు కూడా!

మీకు చాలా ఏళ్ళుగా పరిచితమైన టీవీ హీరో హీరోయిన్స్‌తోబాటు, మన 'కవిని కాన్న వాడిని కత్తితో పొడుస్తా' శ్రీలక్ష్మిగారూ, ఎల్.బి శ్రీరాం గారూ లాంటి ప్రముఖులు కూడా మీకీ చాయ్ షాట్స్‌లో తెరమీద కనిపించి నవ్వించి కొన్నిసార్లు మనసు ఆర్ద్రం చేస్తారు.

9లో 7 స్క్రిప్ట్‌లు కథ, స్క్రీన్ ప్లే డైలాగ్స్ కలిపి నేనే అందించాను. వీపు నెప్పితో చాలా బాధపడ్తూ కూడా ఈ కొత్త మాధ్యమంలో ఎలా రాయాలో వారికి నేర్పి, దగ్గరుండి ప్రొడక్షన్ చూసుకుంటున్నాను. మళ్ళీ నెక్స్ట్ విడత రెడీ అయ్యాయి.

నా కాలం అన్నా కథలన్నా, నవలలన్నా, సినిమాలన్నా ఇష్టపడే వారు చాలామంది ఈ కౌముది పాఠకులు.. కాబట్టి నా అనుభవాలు మీతో పంచుకుంటూ, మీ అందరినీ చాయ్ షాట్స్ డౌన్‌లోడ్ చేసుకోమని కోరుతున్నాను.

మన కాలంలో, 80లలో, 90లలో పెరిగిన పిల్లల అనుభవాలూ అన్నీ కూడా తెరకి ఎక్కించే ప్రయత్నంలో వున్నాను. మిగతా విశేషాలు మళ్ళీ రాస్తాను.

Post your comments







